

విద్యుత్‌కు రూ.170 కోట్లు

ఒంగోలు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు రూ.170 కోట్లు వెచ్చించినట్లు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. - 8లో..



భర్తను చంపిన భార్య

భర్తను తన ఇంట్లోనే భార్య హత్య చేసిన ఘటన ఒంగోలులో శుక్రవారం రాత్రి జరగ్గా శనివారం వెలుగులోకి వచ్చింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
31.6/24.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాలికను నిర్బంధించిన కేసులో ఉపాధ్యాయుడు సస్పెన్షన్

పెద్దదోర్నాల: బాలికను నిర్బంధించిన కేసులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కొమరోలు శ్రీనివాసప్రసాద్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ మస్తాన్‌నాయక్ శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన బాలికను నిర్బంధించటంతో పాటు ఇదేమని ప్రశ్నించిన బాలిక సోదరుడిపై కత్తితో దాడి చేసిన నేపథ్యంలో అతనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసును నమోదైనట్లు ఆయన తెలిపారు. దీంతో ఉన్నతాధికారులు అతడిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1300 కేసుల పరిష్కారం

ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా శనివారం జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో నిర్వహించిన కార్యక్రమంలో 1300 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి పేర్కొన్నారు. 230 సివిల్ కేసులు, 980 క్రిమినల్ కేసులు, 90 ప్రీలిటిగేషన్ కేసులు ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించారన్నారు. బ్యాంకు వ్యాజ్యాలకు సంబంధించి దాదాపు రూ.5 లక్షల విలువైన కేసులు, రూ.2 కోట్ల విలువైన బీమా పరిహారపు చెల్లింపు కేసుల ద్వారా కక్షిదారులకు చెల్లింపులు జరిగాయన్నారు. సివిల్ వ్యాజ్యాలను పరిష్కరించుకున్న వారికి వారు కోర్టుకు చెల్లించిన ఫీజును తిరిగి ఇస్తారన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం అంటే ఇరు వర్గాలు గెలిచినట్లే అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించిన కక్షిదారులకు, న్యాయవాదులకు శుభాకాంక్షలు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదిక అన్నారు. జిల్లాలోని 10 కోర్టు ప్రాంగణాల్లో మొత్తం 26 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లోక్ అదాలత్‌లో చేసుకున్న పరిష్కారంపై ఎటువంటి అప్పీల్ ఉండదని, చిన్న చిన్న కేసులు, రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని ప్రజలు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం కోసం అదనపు జిల్లా న్యాయమూర్తులు ఆర్.శివకుమార్, ఎంఏ సోమశేఖర్, టి.రాజా వెంకటాద్రి, డి.అమ్మన్నరాజా సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎంతో కృషిచేశారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి ప్రశంసించారు.



ప్రాజెక్టులో నుంచి దిగువకు వెళుతున్న నీరు

టీడీపీ పాపం..
గుండ్లకమ్మకు శాపం..

నాటి తెలుగుదేశం ప్రభుత్వం పాపాలు నేటికీ గుండ్లకమ్మ ప్రాజెక్టును వెంటాడుతూనే ఉన్నాయి. అధికారంలో ఉన్నంత కాలం జలాశయాన్ని గాలికొదిలేసి..అరకొరగా విడుదల చేసిన నిధులను ఆపార్టీ పెద్దలు మింగేశారు. పచ్చనేతల ధనదాహం నేడు ప్రాజెక్టు పాలిట శాపంగా మారింది. ఐదేళ్లపాటు కనీస నిర్వహణ కూడా చేయకపోవడంతో గేట్లు తుప్పుబట్టి ఒక్కొక్కటిగా మరమ్మతులకు గురవుతున్నాయి. అత్యవసరమైన మరమ్మతులు చేస్తూనే శాశ్వత ప్రాదిపదికన గేట్లను పటిష్ఠం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి వాస్తవాలను తప్పుదోవ పట్టిస్తూ తమ పాపాలను కప్పిపుచ్చుకుంటూ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు టీడీపీ నేతలు.

- టీడీపీ పాలనలో ఆదాయవనరుగా మారిన ప్రాజెక్టు నిధులు
- ప్రాజెక్టు గేట్ల నిర్వహణ కోసం రూ.3.57 కోట్లు
- పరిసరాల అలంకరణ కోసం రూ.1.58 కోట్లు
- గేట్ల మరమ్మతుల నిధులు మొత్తం స్వాహా..
- గేట్లకు రంగులు మినహా గ్రీజ్ కూడా పూయని వైనం
- సుందరీకరణ నిధుల్లో కూడా సగానికి పైగా స్వాహా
- నాడు నిధులు మింగేసి.. నేడు ఆ పార్టీ ఎమ్మెల్యేల హైడ్రామా
- హై లెవల్ టెక్నికల్ టీం పర్యవేక్షణలో పునరుద్ధరణ పనులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ప్రతిష్టాత్మకమైన కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టులో కీలకమైన స్పిల్ వే గేట్ల విషయంలో నాడు పచ్చ నేతల ధనదాహం నేడు ప్రాజెక్టుపై ప్రభావం చూపిస్తోంది. చంద్రబాబు అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 మార్చి ప్రాజెక్టు కోసం అరకొరగా విడుదలచేసిన కోట్లాది రూపాయలు టీడీపీ నేతలకు ఆదాయ వనరుగా మారాయి. ప్రాజెక్టు నిర్వహణ నిమిత్తం ఇచ్చిన సొమ్మును అప్పనంగా పచ్చ బ్యాచ్ కాజేసింది. ప్రభుత్వం ఇచ్చిన నిధులతో చేపట్టాల్సిన నిర్వహణను గాలికి వదిలేసి అందినకాడికి దోచుకున్నారు. అదేమంటే ప్రాజెక్టు గేట్లకు రంగులు వేశామని నిస్సిగ్గుగా ప్రకటనలు చేయడం ఆపార్టీ నేతలకే చెల్లిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాడు నిధులు సక్రమంగా వినియోగించి ఉంటే ప్రస్తుతం గేట్లు అవసాన దశకు చేరేవే కాదన్నది అక్షర సత్యం. గేట్ల మరమ్మతులకు సక్రమంగా వినియోగించకుండా నిధులు దిగమింగటంతోనే అవి తుప్పుపట్టి ఒక్కొక్కటిగా దెబ్బతింటూ వస్తున్నాయి. అయితే ప్రాజెక్టు సుందరీకరణ పేరుతో విడుదల చేసిన నిధులనూ వదిలిపెట్టకుండా వాటిలో కూడా సగానికి పైగా ఆరగించేశారు. మొత్తం మీద టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.5.15 కోట్లు విడుదల చేస్తే వాటిలో కనీసం 25 శాతం కూడా ఖర్చు చేయలేదు.

సుందరీకరణ పేరుతో స్వాహా

గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణకు 2014–19 వరకు ఐదేళ్ల పాలనలో టీడీపీ ప్రభుత్వం రూ.5.15 కోట్లు విడుదల చేస్తే వాటిని మూడో కంటికి తెలియకుండా ఆరగించేశారు. స్పిల్ వే గేట్ల నిర్వహణకు రూ.3.57 కోట్లు, బ్యూటిఫికేషన్ కోసం రూ.1.58 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. సుందరీకరణ పనులు తూ..తూ మంత్రంగా చేసి నిధులు మాత్రం కాజేశారు. ప్రాజెక్టుకు ఆయువుపట్టయిన స్పిల్ వే గేట్లు నిర్వహణలను మాత్రం గాలికి వదిలేశారు. పర్యవసానంగా ప్రాజెక్టు గేట్లు తుప్పుబట్టి ఒకటొకటిగా దెబ్బతింటున్నాయి.

అందుకు సంబంధించిన పూర్తి వివరాలు కింది విధంగా ఉన్నాయి:

- 2013–14 సంవత్సరంలో గేట్లకు గ్రీజు పెట్టటానికి, వైర్ రోప్ ఆయిలింగ్, ఇతర మరమ్మతుల కోసం రూ.6.70 లక్షలు విడుదల.
- 2014–15లో స్పిల్ వే రెగ్యులర్ గేట్లు ఒవరాయిలింగ్ కోసం రూ.1.77 లక్షలు
- 2014–15లో గేట్ల నిర్వహణకు రూ.2.98 లక్షలు
- 2014–15లో రంగులకు, ప్రాజెక్టులో నీళ్లలో ఉండే గేట్లు ఇసుక మేటను తొలగించేందుకు, ఇతర మరమ్మతులకు రూ.30.94 లక్షలు
- 2014–15లో ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా సెక్యూరిటీ కోసం, లైట్లు, గార్డెన్ నిర్వహణ, చిల్డ్రన్ పార్కు ఏర్పాటు కోసం రూ.41.62 లక్షలు
- 2015–16లో 15 స్పిల్ వే గేట్లకు రంగులు వేయటంతో పాటు తుప్పు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు ఇతర మరమ్మతుల కోసం రూ.77.91 లక్షలు.
- 2015–16లో తెలుగు తల్లి విగ్రహం సెక్యూరిటీ సిబ్బందికి, లైట్లు, గార్డెన్ నిర్వహణ, చిల్డ్రన్ పార్కు నిర్వహణ కోసం రూ.104.32 లక్షలు.
- 2016–17లో అన్ని గేట్లకు గ్రీజు పెట్టడం, ఒవరాయిలింగ్, గేట్ల రోలర్ల నిర్వహణ, గేట్ల మరమ్మతులు, లిఫ్టింగ్ బీమ్‌లను ఆధునీకరించటం కోసం రూ.21.18 లక్షలు.
- 2017–18లో కుడి కాలువకు సంబంధించి రెండు తూముల నిర్వహణ పనులు, ఈఎం పార్ట్స్ ఆధునీకరించటం, రంగులు వేయటానికి రూ.3.67 లక్షలు.
- 2017–18లో స్టాప్ లాగ్స్ గేట్లకు సంబంధించి అడుగున ఉన్న దెబ్బతిన్న సీళ్లు, వాటి స్థానంలో కొత్త సీళ్లు అమర్చటానికి రూ.5.95 లక్షలు.
- 15 గేట్లకు ఓవరాయిలింగ్ చేయటం, గాంట్రీ క్రేన్, స్టాప్ లాగ్‌ల ఎలిమెంట్లకు, బీమ్, బ్రిడ్జిల నిర్వహణకు, రంగులు వేసేందుకు రూ.139.65 లక్షలు.
- 2017–18లో ప్రత్యేక మరమ్మతులు, స్పిల్ వే రెగ్యులర్ గేట్లు ఆధునీకరించటానికి, ఇతర అవసరాల కోసం రూ.47.62 లక్షలు.
- 2017–18లో గేట్ల రబ్బర్ సీళ్లు మార్చటం, ఒవరాయిలింగ్, గ్రీజు పెట్టటంతో పాటు ఇతర మరమ్మతుల కోసం రూ.7.84 లక్షలు.
- 2017–18లో స్పిల్ వే గేట్లకు రంగులు వేయటానికి రూ.0.81 లక్షలు.
- 2019–20లో స్పిల్ వే గేట్లు ఎత్తటానికి, దించటానికి అనువుగా చేసేలా నిర్వహణ కోసం రూ.10.41 లక్షలు.
- 2019 మార్చిలోపు మోడల్ రూమ్‌కు రంగులు, స్పిల్ వే గేట్ల రెయిల్స్‌తో పాటు ఇతర నిర్వహణ పనుల కోసం రూ.12.15 లక్షలు.



దెబ్బతిన్న ప్రాజెక్టు గేటు

మెకానికల్ పనులు వేగంగా జరిగేవి కావు

గత ఏడాది మూడో గేటు కొట్టుకు పోయిన తరువాత అప్పట్లో యుద్ధ ప్రాతిపదికన స్టాప్ లాగ్ గేటును ఏర్పాటు చేశాం. అప్పట్లో ప్రభుత్వం రిజర్వాయర్‌లోని నీటిని నిల్వ చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాం. 6, 7 గేట్లు బలహీనంగా ఉంటే అప్పట్లో హైలెవల్ కమిటీ వచ్చి సాంకేతికపరమైన నిర్ణయాలు చేసి వాటి మరమ్మతులకు రూ.1.11 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఉన్న స్టాప్ లాగ్‌లు అన్నీ ఆ రెండు గేట్లకు పెట్టి పనులు ఆధునీకరించాం. మూడో గేటు బలహీనంగా ఉండటంతో దానికోసం రూ.60 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేద్దామనుకునేలోపే పైనుంచి వరద ఉధృతి పెరగటంతో అడుగు భాగం కొట్టుకుపోయింది. పూర్తిస్థాయిలో స్పిల్ వే గేట్లు మరమ్మతుల కోసం రూ.9.14 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అవి టెండర్లు పూర్తి చేసుకొని పనులు మొదలు పెడదామనుకునే సరికే ఈ ప్రమాదం జరిగింది. ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయించింది. ప్రాజెక్టుల్లోని మెకానికల్ పనులు వేగంగా జరిగేవి కావు. నీళ్లలో పనులు కాబట్టి కొంత ఆలస్యం కావటం సహజం. ఒక పద్ధతి ప్రకారం పనులు చేసుకుంటూ పోవాలి. ప్రస్తుతం ప్రాజెక్టులోని అన్ని గేట్లు కిందకు దించుతున్నాం. ఆ మూడో గేటు ద్వారా మొత్తం 0.1 టీఎంసీ నీరు కూడా బయటకు పోవు. శనివారం రాత్రికి స్టాప్‌లాగ్ అమర్చి నీరు బయటకు పోకుండా అడ్డుకోగలిగాం. ప్రాజెక్టులో 1.20 టీఎంసీల నీటిని నిల్వ చేసుకుంటున్నాం.

– అబూతలేం, ఎస్ఈ, జిల్లా జలవనరుల శాఖ

దొంగే దొంగా...దొంగా అన్న చందంగా ...

దొంగే దొంగా...దొంగా అన్న చందంగా తయారైంది టీడీపీ నేతల తీరు. వాళ్ల ప్రభుత్వ హయాంలో చేసిన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని భావించిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు శనివారం గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించారు. కొండపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌లతో పాటు ఇతర నేతలు ప్రాజెక్టు వద్దకు వెళ్లి జలవనరుల శాఖ అధికారులతో వాదనకు దిగారు. గేట్లు బాగు చేయలేని ప్రభుత్వం అంటూ దూషణకు దిగారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం ఇచ్చిన నిధులను స్వాహా చేసి ఇప్పుడేమో మొసలి కన్నీరు కారుస్తూ ప్రాజెక్టుకు ఏదో అన్యాయం జరిగిపోయినట్లు వ్యవహరించడం సరికాదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు దగ్గర నుంచి కింది స్థాయి నాయకుల వరకూ వాస్తవాలను కప్పిపుచ్చుతూ అసత్య ప్రచారాలు చేయడం పరిపాటిగా మారింది.

ప్రాజెక్టును పరిశీలించిన హైలెవల్ టెక్నికల్ టీమ్....

రాష్ట్ర రాజధాని నుంచి హై లెవల్ టెక్నికల్ టీమ్ శనివారం ప్రాజెక్టును పరిశీలించింది. హైడ్రాలజీ విభాగానికి చెందిన అధికారుల బృందం ప్రాజెక్టును నిశితంగా పరిశీలించింది. హైడ్రాలజీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సీఈ టీకేవీ.కుమార్ నేతృత్వంలో ప్రాజెక్టు స్పిల్ వే గేట్ల పరిస్థితిని పరిశీలించారు. అధికారుల బృందంలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులు కూడా ఉన్నారు. ఈఈ వేణుగోపాల్, డ్యామ్ సేఫ్టీ సెల్ సీఈ రత్న కుమార్, జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈ ఆర్.మురళీనాథరెడ్డి, జిల్లా ఎస్ఈ అబూతలేం, ఈఈ నాగ మురళి కూడా శుక్రవారం రాత్రి నుంచి ప్రాజెక్టు వద్దే ఉన్నారు.



ప్రాజెక్టు వద్ద సమీక్షిస్తున్న హైలెవల్ టెక్నికల్ టీమ్

ఒంగోలు నుంచే పోటీ చేస్తా

- డబ్బులు సంపాదించాలనే ఆశలేదు
- ఇళ్ల స్థలాల పంపిణీ సమస్య లేదు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేస్తాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



అన్న సినిమా ఆడియో రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: మీ అందరి సహకారంతో వచ్చే ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శనివారం 'అన్న' సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్లో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తాను నెల్లూరు నుంచి పోటీ చేస్తానని, పార్టీ మారుతానని కొందరు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ''నేను ఎక్కడికి పోను..మీ అండదండలతో ఒంగోలు నుంచే పోటీ చేస్తాను. మీ కోసం పని చేస్తున్నాను, మీ కోసమే పోటీ చేస్తానని'' తేల్చి చెప్పారు. కచ్చితంగా ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తేనే పోటీ చేస్తానని చెప్పానని, త్వరలోనే ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వనున్నామని, ఇప్పుడా సమస్య కూడా లేదని చెప్పారు. ఇప్పటికే 5 సార్లు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు మంత్రిగా చేశానన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, అవినీతికి పాల్పడి డబ్బులు సంపాదించలేదని, అప్పులు చేసి రాజకీయాలు చేస్తున్నానని చెప్పారు. తన కుమారుడికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఎంతో ఇష్టమని, జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడని అన్నారు. ''కొందరు వ్యక్తులు నా గురించి, నా కుమారుడి గురించి అదే పనిగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నా కుమారుడి మీద బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. దిగజారిన ఈ రాజకీయాలను చూస్తుంటే వెగటు పుడుతోంది. పాతిక సంవత్సరాలకు పైగా రాజకీయాలు చేశాను. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవని'' ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల్లో ఒక సామాజికవర్గం రోడ్డు మీదకు వచ్చి పని చేయడానికి సిద్ధంగా ఉందని, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా అదే విధంగా పట్టుదలగా పనిచేయాలని కోరారు.

పెద్ద హీరోతో సినిమా తీస్తా...

తాను రాజకీయాల్లోకి రాక ముందు నుంచే సినిమా తీయాలనే కోరిక ఉండేదని, అందుకోసం ఆ రోజుల్లోనే మద్రాసు వెళ్లి దర్శకుడు కోడి రామకృష్ణకు అడ్వాన్స్ ఇచ్చినట్లు బాలినేని చెప్పారు. హీరో మోహన్‌బాబుకు కూడా అడ్వాన్స్ ఇచ్చామని తెలిపారు. సినిమా ప్రారంభం ఆలస్యం కావడంతో సినిమా ఆగిపోయిందని గుర్తు చేసుకున్నారు. ఎప్పటికైనా నా సరే సినిమా తీస్తానని, పెద్ద హీరోతోనే సినిమా తీస్తానని, ఒంగోలులో షూటింగ్ చేస్తామని చెప్పారు.

నిజాయతీ కలిగిన నాయకుడు బాలినేని: అజయ్ ఘోష్

ప్రస్తుత రాజకీయాల్లో ఎక్కడో కొంత మంది మాత్రమే నిజాయతీ కలిగిన నాయకులు ఉన్నారని, అలాంటి వారిలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఒకరని సినీ నటుడు అజయ్ ఘోష్ అన్నారు. 'అన్న' సినిమా ఆడియో ఫంక్షన్ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ.. కొంత మంది నాయకులు నేను అంత అభివృద్ధి చేశాను, ఇంత అభివృద్ధి చేశాను అంటూ డబ్బా కొడుతుంటారని ఎద్దేవా చేశారు. బాలినేని సొంతడబ్బా కొట్టుకునే నాయకుడు కాదన్నారు. ఒంగోలు ప్రజలకు ఆయన చేసిన సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. నొసటితో నవ్వి నోటితో వెక్కిరించే తత్వం కలిగిన నాయకుడు కాదు. అసలు సిసలు ప్రజా నాయకుడు బాలినేని అని చెప్పారు. ప్రజల నేతగా పేరొందిన బాలినేని శ్రీనివాసరెడ్డిని జిల్లా ప్రజలంతా వాసన్న అని ప్రేమగా పిలుచుకుంటారని, ఆయన కోసం దేనికైనా సిద్ధపడతామని నగర మేయర్ గంగాడ సుజాత స్పష్టం చేశారు. రాష్ట్రానికి జగనన్న, ఒంగోలు జిల్లాకు వాసన్న అవసరం ఎంతైనా ఉందని 'అన్న' సినిమా దర్శకుడు వెంకట రమణ పసుపులేటి చెప్పారు. వాసన్నను గెలిపించడం కోసం తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇంతియాజ్, జిల్లా అధికార ప్రతినిధి కావటి రవి కుమార్, బి.కోటేశ్వరరావు, నిర్మాత ఈదిపల్లి శివ, బేతంశెట్టి హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'అన్న' సినిమా పాటల విడుదల

శ్వేతార్క, గణపతి ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై నిర్మించిన అన్న (జనం పార్ట్–2) సినిమాలోని మూడు పాటలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. మిగతా మూడు పాటను విజయవాడలో ఆవిష్కరించనున్నట్లు సినిమా దర్శకుడు వెంకట రమణ పసుపులేటి తెలిపారు. ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శిస్తున్న 'జనం' సినిమాకు రెండో పార్ట్‌గా వస్తున్న ఈ 'అన్న' సినిమా జగనన్న, వాసన్నల విశిష్టతలను తెలియజేస్తూ నిర్మించామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఒంగోలు నుంచి బాలినేని వాసన్న గెలుస్తారని, రాష్ట్రానికి జగనన్న, జిల్లాకు వాసన్న అవసరం ఎంతో ఉందన్న వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసేలా సినిమాను నిర్మించినట్లు తెలిపారు.

ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎదురులేని 'మన జండా' అనే పాటను ఆవిష్కరించారు. 'వాసన్న వాసన్న' అనే పాటను నగర మేయర్ గంగాడ సుజాత, 'గుండెల్లో దమ్మున్న మగాడు జగనన్న' అనే పాటను కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ, షేక్ ఇంతియాజ్ ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బాలినేని ప్రసంగిస్తూ ఈ సినిమా మంచి ప్రజాదరణ పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. 'అన్న' మంచి సందేశాత్మక సినిమా అవుతుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. నిర్మాత ఈదిపల్లి శివ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, బేతం శెట్టి హరి, కావటి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




'అన్న' సినిమా ఆడియో రిలీజ్ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

గుండ్లకమ్మ నదిలో వరద ఉధృతి



గుండ్లకమ్మ నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

నాగులుప్పలపాడు: గుండ్లకమ్మ ప్రాజెక్టుకు సంబంధించి శుక్రవారం రాత్రి రెండో గేటుకు సంబంధించి 2 ఎలిమెంట్‌లు పాడైపోవడంతో డ్యాంలోని నీరు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రభావంతో దిగువన ఉన్న మద్దిరాలపాడు వద్ద ఉన్న బ్రిడ్జికి ఆనుకొని వరద నీరు పారుతోంది. నదిలో నీటి వరద ఎక్కువ కావడంతో నీరు సమీపంలోని పొలాల్లోకి పెద్ద ఎత్తున చేరింది. దీంతో చాలా మేరకు పంటలు నీట మునిగాయి. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున గుండ్లకమ్మ నదిలోకి ఎవ్వరూ వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ సుజన్ కుమార్ హెచ్చరించారు.



పొలాల్లోకి చేరిన వరద ఉధృతి

క్లుప్తంగా

జాతీయస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

ఒంగోలు: 28వ జాతీయస్థాయి తైక్వాండో పోటీలు శనివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను 8వ డాన్ వై.మారుతీప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, నాగాలాండ్, తమిళనాడు, బీహార్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తి ప్రదర్శిస్తూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో పలువురు చిన్నారులు పాల్గొని సత్తా చాటారు. తైక్వాండో కోచ్‌లు సుబ్బరాయ, మార్కర్, లోకేష్, జయబాబు, సుబ్బు, వైకే శ్రీనివాసరావు, బాబూరావు, ప్రభ, హబీబుల్లా, శరవణ, జి.శ్రీను, ఎస్‌కే సుభాని, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా వ్యక్తి అదృశ్యం



వెంకటనారాయణ (ఫైల్)

మద్దిపాడు: గత రెండు నెలలుగా కనిపించని తన బిడ్డ వెంకటనారాయణ ఆచూకీ తెలియజేయాలని తండ్రి భైరపనేని కోటయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ బి. శివబసవరాజు తెలిపారు. కెల్లంపల్లి గ్రామానికి చెందిన భైరపనేని వెంకటనారాయణ (48)తో పాటు తండ్రి అక్టోబర్ 7న పొలంలో పనిచేసుకుంటున్నారు. ఆ సమయంలో వెంకటనారాయణ కాలుకు ముళ్లు గుచ్చుకోవడంతో వైద్యశాలకు వెళ్లి వస్తానని చెప్పి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. వెంకటనారాయణ ఆకుపచ్చ గళ్ల లుంగీ, పసుపు చొక్కా, చారలు కలిగిన కండువా ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు.

విద్యుత్‌కు రూ.170 కోట్లు ఖర్చు చేశాం

- ప్రజల ఇబ్బందులు తీర్చడానికి ఒంగోలులో అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు చేశాం
- కొత్తపట్నం, ఒంగోలు మండలాల్లో రూ.27 కోట్లు వెచ్చించాం
- ఒంగోలులో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్ రెండో నిర్మాణం జరుగుతోంది
- శ్రీగిరి కొండపై 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు రూ.170 కోట్లు ఖర్చు చేశామని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీగిరి కొండపై నూతనంగా నిర్మించిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. రూ.4 కోట్లు వెచ్చించి శ్రీగిరి కొండపై నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం ద్వారా ఈ ప్రాంతంలోని ప్రజలకు విద్యుత్ సమస్య తొలగిందన్నారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, క్లౌ పేట, రైల్వేస్టేషన్ రోడ్డు, కమ్మపాలెం, తూర్పు క్రిస్టియన్ పాలెంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. కొత్తపట్నం బస్టాండ్ ఏరియా ఖరీదైన స్థలం కావటంతో ఎక్కడ ఏర్పాటు చేయాలని చూసినా స్థలం అందుబాటులో లేదన్నారు. చివరకు పోలీస్ శాఖకు చెందిన డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న స్థలాన్ని తీసుకోవటానికి చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. ఇళ్ల మధ్యలో విద్యుత్ సబ్‌స్టేషన్ అంటే చుట్టుపక్కల ఇళ్ల వాళ్లే అంగీకరించరని, అందులో పోలీస్ క్వార్టర్స్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ అంటే సవాలక్ష సమాధానాలు చెప్పాల్సి వచ్చిందని వివరించారు. ఇళ్ల మధ్యలో సబ్‌స్టేషన్ కాబట్టి సెమీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించాల్సి వచ్చిందన్నారు. ఒంగోలు నగరంలో రెండో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌ని నిర్మిస్తున్నామన్నారు. మొదటిది పాత గుంటూరు రోడ్డులో నిర్మించామన్నారు. ఒంగోలు నగరంలో దశాబ్దాల తరబడి ఉన్న కర్నూలు రోడ్డు, అంజయ్య రోడ్డులోని హై టెన్షన్ విద్యుత్ లైనును తీసేసి అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేసుకోగలిగామన్నారు. రూ.63 కోట్లు ఖర్చుచేసి నిర్మాణం పూర్తి చేశామని బాలినేని వెల్లడించారు. అదేవిధంగా ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.27 కోట్లు ఖర్చుచేశామని వివరించారు. ఒక పేపరులో యరజర్ల కొండ ప్రాంతాన్ని మైనింగ్ నుంచి తొలగించారని రాశారని, అది అసత్యమని అన్నారు. ఇకపోతే మోటుమాలలో ఇళ్ల పట్టాలు ఇస్తుంటే ఫేక్ అని టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని, అవి ఫేక్ అయితే నా ఆస్తులు రాసిస్తా, ఫేక్ కాకపోతే దామచర్ల జనార్దన్ తన ఆస్తులు రాసిస్తారా అని సవాలు విసిరారు. కొత్తపట్నం బకింగ్ హాం కెనాల్ కాంట్రాక్టర్‌ను అతని గ్రిప్‌లో పెట్టుకుని తనను ఏదో అభాసుపాలు చేయాలని చూస్తున్నాడని ధ్వజమెత్తారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు శాశ్వతంగా మరమ్మతులు పూర్తి చేయడానికి సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, స్థానిక కార్పొరేటర్ జడా వెంకటేష్, ఏపీసీపీడీసీఎల్ మెంబర్ జిల్లెళ్లమూడి రమాదేవి, ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, ఒంగోలు విద్యుత్ ఈఈ శ్రీనివాసులు, కన్‌స్ట్రక్షన్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు డీఈఈ వినయ్ కుమార్‌రెడ్డి, డీ–2 ఏఈ డి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్ బాషా

టంగుటూరు: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన స్థానిక టోల్ ప్లాజా సమీపంలో సంధ్య ఆక్వా వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు శ్రీనగర్ కాలనీకి చెందిన శ్రీరామ రంగారావు (65) సింగరాయకొండలో తన వరుసకి తమ్ముడైన వ్యక్తి కర్మకు హాజరై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో టోల్ ప్లాజా సమీపంలో ఓ లారీ అతి వేగంగా వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై నుంచి శ్రీరామ రంగారావు పడి తీవ్ర రక్త గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పంచనామ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పుల్లలచెరువు: మండలంలోని కవలకుంట్ల శివారు ప్రాంతంలో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలై ఒకరు మృతి చెందిన సంఘటన తెలిసిందే. గాయపడి యర్రగొండపాలెంలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో గంగవరం గ్రామానికి చెందిన కేశనపల్లి గురవయ్య (36) శనివారం ఉదయం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

కంటైనర్ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 13 మందికి గాయాలు



లారీని ఢీకొన్న కనిగిరి డిపో బస్సు



గాయాలైన వారిని 108 ద్వారా ఒంగోలు జీజీహెచ్‌కి తరలిస్తున్న దృశ్యం

మద్దిపాడు: కంటైనర్ లారీని ఆర్టీసీ బస్ ఢీకొన్న ఘటనలో 13 మందికి స్వల్ప గాయాలైన ఘటన ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న ఐషర్ షోరూమ్ సమీపంలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్ విజయవాడలో రాత్రి 11 గంటల సమయంలో బయలుదేరి తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఏడుగుండ్లపాడు వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో ఆర్టీసీ డ్రైవర్ ముందు వెళ్తున్న కంటైనర్ లారీని వేగంగా ఓవర్ టేక్ చేస్తూ బస్సు ఎడమ వైపు నుంచి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఉలిక్కి పడి లేచి హాహాకారాలు చేస్తూ ఎమర్జెన్సీ గేటులో నుంచి కిందకు దిగారు. బస్సులో ప్రయాణిస్తున్న 13 మందికి స్వల్పగాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, మద్దిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది ఉన్నారు. గాయపడిన వారిలో విజయవాడకు చెందిన షేక్ ఖాజా వలి, పొదిలి మండలం అక్క చెరువుపాలేనికి చెందిన వేల్పుల ప్రభుదాసు, వేల్పుల నవీన్, గుంటూరు జిల్లా వడ్డిచెరుకూరు గ్రామానికి చెందిన భీమినేని మోహనరావు, మద్దిపాడు మండలం గంగపాలేనికి చెందిన పబ్బర్తి రాములమ్మ, ఒంగోలుకు చెందిన బొందిర సాయి పవన్, పొదిలి మండలానికి చెందిన ధర్మవరపు సుబ్బులమ్మ, కొనకనమిట్ల మండలం పాతపాడుకు చెందిన దొంతి దేవ పిచ్చిరెడ్డి, ఆయన భార్య పద్మ, కనిగిరికి చెందిన రేగలగడ్డ రవి, కనిగిరి వీరారెడ్డి పల్లెకు చెందిన వరాల జనార్దన్, తూర్పు గోదావరి జిల్లా అమలాపురానికి చెందిన ఆర్ ఏడుకొండలు కనిగిరికి చెందిన సతీష్ ఉన్నారు. వీరందరికీ స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేసి పంపివేశారు. క్షతగాత్రులను మద్దిపాడు ఎస్‌ఐ శ్రీకాంత్ శనివారం ఉదయం జీజీహెచ్‌లో పరామర్శించారు.

ఓ వ్యక్తి తలలో గడ్డకట్టిన రక్తం



రామారావు రిపోర్టులను పరిశీలిస్తున్న డాక్టర్ వలిబాబు

ఒంగోలు టౌన్: విజయవాడ నుంచి కనిగిరి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఏడుగుండ్లపాడు వద్ద కంటైనర్ లారీని వెనుకనుంచి ఢీ కొన్న సంఘటనలో గాయపడిన క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో గాయపడిన 18 మంది ప్రయాణికులను తీసుకొని వచ్చారు. దాదాపుగా అందరికీ స్వల్ప గాయాలయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో కళంకారి పనిచేసే రాజమండ్రికి చెందిన వై.రామారావు తలలో రక్తం గడ్డ కట్టినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే ఆయనను క్యాజువాలిటీ నుంచి న్యూరో సర్జరీ వార్డుకు తరలించారు. న్యూరో సర్జన్ షేక్ వలిబాబు రోగి పరిస్థితిని పరిశీలించి అబ్జర్వేషన్‌లో ఉంచారు. అవసరమైతే ఆపరేషన్ చేయడానికి ఏర్పాటు చేసిన జీజీహెచ్ సిబ్బంది రామారావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

17న జాతీయ తైక్వాండో క్రీడాకారుల ఎంపిక


ఒంగోలు: ఈనెల 17న స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో 38వ జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ది ఒంగోలు తైక్వాండో అసోసియేషన్ అంతర్జాతీయ కోచ్, 5వ డాన్ షేక్ కరిముల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 22, 23, 24 తేదీల్లో విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మొత్తం 10 రాష్ట్రాల నుంచి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జాతీయస్థాయి పోటీలు జరుగుతున్న దృష్ట్యా అన్ని విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేసేందుకు బాలబాలికలు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొని ప్రతిభ కనబరచాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9848838583 నంబర్‌ని సంప్రదించాలన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

త్రిపురాంతకం: నేషనల్ హైవే పై బస్‌లో అక్రమంగా బెంగళూరు తరలిస్తున్న సుమారు 20 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. త్రిపురాంతకం మండలం దూపాడు సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తెలంగాణ జనగామ నుంచి రాజమండ్రికి గంజాయితో వచ్చిన వ్యక్తి, అక్కడ నుంచి కర్నూలు వరకు వెళుతున్న బస్‌లో తరలిస్తూ పట్టుబడ్డాడు. పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

యువకునిపై కత్తితో దాడి

- హత్యాయత్నం చేసిన ఇద్దరు
- పాతకక్షలే కారణమన్న పోలీసులు



దాడికి ఉపయోగించిన కత్తి



మెడపై కత్తి దాడితో గాయాల పాలైన శ్రీకాంత్ మెడపై అయిన గాయం (ఇన్‌సెట్)

సింగరాయకొండ (మద్దిపాడు): క్రికెట్ మ్యాచ్ చూడటానికి వచ్చిన వ్యక్తిపై అకస్మాత్తుగా హత్యాయత్నం జరిగింది. మిరియం శ్రీకాంత్ అనే యువకునిపై కొల్లా సాయి, రౌడీషీటర్ షేక్ షరీఫ్‌లు కత్తితో దాడికి పాల్పడ్డ సంఘటన శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్‌టోర్న మెంట్ వద్ద జరిగింది. ఇక్కడ కొద్దిరోజులుగా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. మ్యాచ్ చూసేందుకు మండలంలోని మూలగుంట పాడు గ్రామానికి చెందిన మిరియం శ్రీకాంత్ వచ్చాడు. ఆ సమయంలో రౌడీషీటర్ షరీఫ్ ఆటోలో కొల్లాసాయితో పాటు షరీఫ్ వచ్చి కళాశాల ఆవరణలో మద్యం సేవించి తర్వాత టోర్నమెంట్ వద్దకు చేరుకున్నారు. తమ స్నేహితుడు రవితేజ చనిపోయినప్పుడు ఎవరూ రాలేదని, ఇప్పుడేమో సంతోషంగా క్రికెట్‌మ్యాచ్ చూస్తున్నారా? అని కేకలు పెడుతూ హల్‌చల్ చేశారు. సమీపంలో ఉన్న శ్రీకాంత్ మెడ కుడి వైపు సాయి, తన వద్ద ఉన్న కత్తితో గాయపరిచాడు. అక్కడే మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్ అప్రమత్తమై.. సాయి చెయిపట్టుకుని బలవంతంగా ఆపడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడిన శ్రీకాంత్‌ను ద్విచక్రవాహనంపై స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. ఈ లోగా షరీఫ్, సాయి ఇద్దరూ ఆటోలో పరారయ్యారు. విషయం తెలిసిన జరుగుమల్లి ఎస్‌ఐ వి. వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆ సమయంలో ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడటంతో పోలీసులు చెదరగొట్టారు. గత సంవత్సరం జరిగిన పసుపులేటి రవితేజ హత్యలో శ్రీకాంత్ నిందితుడుగా ఉన్నాడు. కాగా మృతుడు రవితేజకు సాయి అప్తమిత్రుడు. ఆ హత్యలో శ్రీకాంత్ కూడా పాలుపంచుకున్నాడన్న అనుమానంతో దాడికి పాల్పడ్డాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఏఎస్‌ఐ షేక్ మహబూబ్ బాషా, షేక్ మహబూబ్ బేగ్, షాకీర్ దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను చంపిన భార్య

- నిద్రపోతున్న సమయంలో మెడకు చున్నీ బిగించి హత్య
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు



మల్లికార్జున మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ లక్ష్మణ్

ఒంగోలు సబర్బన్: భర్తను తన ఇంట్లోనే భార్య హత్య చేసిన సంఘటన ఒంగోలు నగరంలోని సీతారాంపురంలో శుక్రవారం రాత్రి జరగ్గా శనివారం వెలుగులోకి వచ్చింది. ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల మేరకు... సంతనూతలపాడుకు చెందిన దర్శి మల్లికార్జున మద్దిరాలపాడుకు చెందిన అశ్వినిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఇటీవల సంతనూతలపాడు నుంచి కుటుంబాన్ని ఒంగోలుకు మార్చాడు. స్థానిక సీతారాంపురంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు పొడచూపాయి. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లో భర్త మల్లికార్జున నిద్రపోతున్న సమయంలో మెడకు చున్నీ బిగించి గట్టిగా లాగటంతో ఊపిరాడక చనిపోయాడు. అనంతరం అశ్విని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పత్తి కాటాలో ఘరానా మోసం

- కార్ కీ రిమోట్‌తో క్వింటాలుకు 30–35 కిలోల తగ్గింపు చూపిన తూకం
- రైతులు గుర్తించటంతో ఒకరు పరార్, మిగతావారు కాళ్ల బేరానికి
- డిజిటల్ కాటాకు కార్‌కీ రిమోట్ అటాచ్ చేసిన మోసగాళ్లు



పత్తి కాటావేసి ఆటోకు లోడు చేస్తున్న యువకులు

కురిచేడు: రైతుల వద్ద పంట కొనుగోలు సమయంలో వేసే కాటాలో అద్దంకి ప్రాంతానికి చెందిన కొంతమంది మోసానికి పాల్పడుతున్న ఘటన కలకలం లేపింది. అలవలపాడు గ్రామానికి చెందిన నలుగురు యువకులు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేసి మిల్లులకు విక్రయిస్తున్నారు. అయితే అత్యాశకుపోయి డిజిటల్ కాటాకు కార్ లాక్ రిమోట్‌ను అటాచ్ చేయించి కాటా తగ్గిస్తూ అధిక లాభాలు పొందడం ప్రారంభించారు. ఇలా రైతులను మోసం చేస్తూ ఎక్కువ మొత్తం పత్తి తీసుకుంటూ తక్కువ కాటా లెక్కన కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో స్థానికంగా మేరువ వెంకటేశ్వరరెడ్డి, పెనుగొండ యోగిరెడ్డి వద్ద పత్తి క్వింటాలు రూ.5500 ప్రకారం రేటు కుదుర్చుకుని కొనుగోలు చేశారు. అయితే వారి వెంట తెచ్చుకున్న డిజిటల్ కాటాకు కార్ కీ రిమోట్‌ను అటాచ్ చేసుకున్నారు. మేరువ వెంకటేశ్వర రెడ్డి వద్ద కాటా వస్తుండగా కొనుగోలు దారుల్లో ఒకరు పదే పదే జేబులో చేయి పెట్టి నొక్కుతున్నాడు. 84 కిలోలు వచ్చిన పత్తి మూట సడన్‌గా 54 కిలోలు చూపింది. 23.200 కిలోలు చూపుతున్న పత్తి మూట సడన్‌గా 16.150 కిలోలకు వచ్చింది. అలాగే పెనుగొండ యోగిరెడ్డికి చెందిన 5 క్వింటాళ్ల పత్తిని మూడున్నర క్వింటాలుగా తూకం చూపి లోడ చేసుకున్నారు. మరో రైతు మేరువ వెంకటేశ్వరరెడ్డి అలియాస్ అబాయి వద్ద మూడు మూటలు కాటావేసిన తరువాత రైతులు అప్రమత్తమై.. కొనుగోలు చేస్తున్న యువకుడిని జేబు పరిశీలించగా కారు లాక్ రిమోట్ లభించింది. దానిని ఆపరేట్ చేసి చూడగా కాటాలో మోసం బయటపడింది. దీంతో ఆ నలుగురిలో ఒకరు పరార్ అయ్యారు. మిగతావారు చేసేది లేక కాళ్ల బేరానికి వచ్చి బతిమాలుకుని తరుగుకు డబ్బులు చెల్లించి ఉడాయించారు. ఆరుగాలం కష్టపడి పెట్టుబడులు పెట్టి పండించిన పంటను మోసం చేయటంతో రైతులు అవాక్కయ్యారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని, వారి చేతుల్లో రైతులు మోసపోకుండా చూడాలని కోరుతున్నారు.



పత్తి కాటాను రిమోట్‌తో ఎలా తగ్గించవచ్చో చూపుతున్న యువకుడు



ఒరిజినల్‌గా ఉన్న తూకం

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు శిద్దా అభినందనలు



ఆషాశ్రీ, కావ్యశ్రీరాంలను సత్కరిస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్

ఒంగోలు: బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపిన ఆషాశ్రీ, కావ్యశ్రీరాంలను టీటీడీ బోర్డు మెంబర్, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్ అభినందించారు. శనివారం స్థానిక లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో వారిద్దరూ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా శిద్దా మాట్లాడుతూ నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు జరిగిన జాతీయ బాలికల డబుల్స్ విభాగం పోటీల్లో వీరిద్దరూ బంగారు పతకం కైవసం చేసుకున్నారన్నారు. వీరిలో ఆషాశ్రీ తమ అకాడమీలో శిక్షణ పొందిన చిన్నారి అని అన్నారు. డబుల్స్‌లో ఆషాశ్రీతోపాటు పాల్గొన్న మరో చిన్నారి కావ్యశ్రీరాం విజయవాడకు చెందిన బాలికగా పేర్కొన్నారు. వీరిద్దరూ బ్యాడ్మింటన్ ఆటలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనడమే కాకుండా అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం కైవసం చేసుకోవడం వారి పట్టుదల, కృషికి నిదర్శనమన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, పుట్టిన ఊరికి, దేశానికి కీర్తిప్రతిష్టలు మరింతగా తీసుకురావాలని పిలుపునిచ్చారు. క్రీడలతో పాటు చదువులోనూ ఇదే పట్టుదల ప్రదర్శించాలని సూచించారు. లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ అండగా ఉంటుందన్నారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థలో 50 మంది పిల్లలు శిక్షణ పొందుతున్నారన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో జాతీయస్థాయిలో శిక్షణ ఇప్పిస్తున్నామని పేర్కొంటూ అకాడమీ గురించి వివరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ బీఎస్ శశిధర్, ప్రముఖ న్యూరో సర్జన్ కేవీ చంద్రశేఖర్, అకాడమీ కార్యదర్శి ఎ.పద్మప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.శశిధర్, ఎం.రఘుబాబు, డి.శ్రీనివాస్, ఎ.కృష్ణప్రసాద్ పాల్గొని ఆషాశ్రీ, కావ్యశ్రీరాంలతో పాటు బాలుర డబుల్స్ విభాగంలో ప్రాతినిధ్యం వహించిన కె.సుహాస్, కోచ్ అమన్‌ను ఘనంగా సన్మానించారు.